# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | మంగళవారం - 30- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 26 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




## బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

- మంచిర్యాల జిల్లాలో ఘటన
- గంటల పాటు అవస్థలు పడ్డ ప్రయాణికులు
- జేసీబీతో బస్సును బయటకు తీసిన గ్రామస్తులు

మంచిర్యాల, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు): మంచిర్యాల జిల్లాలో భారీ వర్షా ల కారణంగా రహదారి బురదమయంగా మారడంతో ఆర్టీసీ బస్సు రోడ్డుపై కూరుకుపోయింది. హాజీపూర్ మండలం దొనబండ సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు ముందుకు కదల్లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం ప్రకారం సాధారణ ప్రయాణంలో ఉన్న ఆర్టీసీ బస్సు దొనబండ సమీపానికి చేరుకోగానే వర్షా లతో బురదగా మారిన రహదారిలో చక్రాలు దిగబడిపోయాయి. డ్రైవర్ పలుమార్లు బస్సును బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో బస్సు అక్కడే నిలిచిపోవాల్సి వచ్చింది.

బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చింది. సమీప గ్రామాల ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సును బయటకు తీసేందుకు ప్రయత్నించినా సాధ్యంకాకపోవడంతో జేసీబీని తీసుకొచ్చారు. జేసీబీ సహాయంతో బస్సును బురదలో నుంచి నెమ్మదిగా బయటకు లాగడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం బస్సు తిరిగి ప్రయాణాన్ని కొనసాగించింది.

మిగతా 2లో

## బియ్యం ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు: ఉత్తమ్

- తెలంగాణను ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- విలువ ఆధారిత ఉత్పత్తులతో అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టి
- రైతులు, రైస్ మిల్లర్లకు ప్రభుత్వం పూర్తి సహకారం

2లో




## శిల్పకళా వేదికలో రైతు భరోసా సదస్సు

- జూన్ 30న సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం
- రాష్ట్రవ్యాప్తంగా రైతుల భాగస్వామ్యం
- వర్షా ల కారణంగా మధిర సభ రద్దు

హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పంపిణీ సదస్సును జూన్ 30న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించనున్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో రైతు ఆశీర్వాద సభగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, వర్షాల కారణంగా ఆ సభను రద్దు చేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచనల మేరకు



మిగతా 2లో

## ఓటరు జాబితాపై కవిత ప్రశ్నలు

- ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- కొడంగల్‌లో డూప్లికేట్ ఓట్లపై అనుమానాలు
- ఇంటర్‌స్టేట్ ఓటర్లపై సమగ్ర విచారణ కోరిన టీఆర్ఎస్

2లో



## ఒలింపిక్ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

- ఒలింపిక్ డే రన్‌లో మహేష్ కుమార్ గౌడ్
- యువత క్రీడల్లో రాణించాలని పిలుపు
- ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన

నిజామాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు): నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 40వ ఒలింపిక్ డే రన్-2026 కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులు, యువతతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఆయన, ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా




మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల ప్రధాన సందేశాలైన క్రమశిక్షణ, ఐక్యత, శాంతి, ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రతి వ్యక్తి అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి,

మిగతా 2లో

## 36 మంది డీఎస్పీలకు పోస్టింగ్ ఉత్తర్వులు

- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా ఉత్తర్వుల అందజేత
- పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని సూచన
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపు

2లో



## ఏరువాకతో ఖరీఫ్‌కు శ్రీకారం

- రైతులతో కలిసి నాగలి దున్నిన మంత్రి పొన్నం ప్రభాకర్
- కూరెళ్ల గ్రామంలో విత్తనాలు చల్లి వ్యవసాయ పనుల ప్రారంభం
- రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

హుస్నాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు): ఏరువాక పౌర్ణమి సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం కూరెళ్ల గ్రామంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులతో కలిసి ఖరీఫ్ వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. నాగలి



దున్ని, విత్తనాలు చల్లుతూ సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.


ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతాంగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. రైతులు భూమాతకు నమస్కరించి కొత్త సాగు పనులను ప్రారంభించే ఈ రోజు ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని భూమాతను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రైతే దేశానికి వెన్నెముక అని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బియ్యం ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు: ఉత్తమ్

**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో బియ్యం ఎగుమతులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణను దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయి బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కేసీపీ న్యూట్రీ సంస్థ రూపొందించిన మల్టీ విటమిన్ బియ్యం ఉత్పత్తులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆహార సంస్థ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నప్పటికీ ఎగుమతుల కోసం ప్రత్యేక వ్యవస్థ లేదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానంతో బియ్యం ఎగుమతులను ప్రోత్సహించే చర్యలు చేపడుతోందని వివరించారు. నాణ్యత ప్రమాణాలు పాటించే పరిశ్రమలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని, అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.



రాష్ట్ర రైతులు, రైస్ మిల్లర్ల ఆదాయం పెంచేందుకు దేశీయ మార్కెట్లతో పాటు విదేశీ మార్కెట్లను కూడా లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. మల్టీ విటమిన్, ఫోర్టిఫైడ్ రైస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని పరిశ్రమలకు సూచించారు. బియ్యానికి విలువ జోడించడం ద్వారా రైతులకు, రైస్ మిల్లర్లకు అధిక లాభాలు చేకూరుతాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ రంగం దేశంలోనే అగ్రగామిగా ఎదిగిందని మంత్రి తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.19,303 కోట్లను నేరుగా జమ చేసిందన్నారు. వానాకాలం, యాసంగి కలిపి రాష్ట్రంలో బియ్యం ఉత్పత్తి 300 లక్షల మెట్రిక్ టన్నులు దాటిందని, రాష్ట్ర అవసరాల కంటే ఎంతో ఎక్కువ ఉత్పత్తి జరుగుతున్నందున ఎగుమతులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు.

సాగునీటి ప్రాజెక్టుల విస్తరణ, వ్యవసాయానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు కారణంగానే ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సాగునీటి రంగంలో చేపట్టిన పెట్టుబడులు రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామి ధాన్య ఉత్పత్తి రాష్ట్రంగా నిలబెట్టాయని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ రంగ బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో గుర్తింపు తీసుకురావడంతో పాటు బియ్యం ఎగుమతుల ద్వారా తెలంగాణకు ప్రత్యేక స్థానం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. రైతులు, రైస్ మిల్లర్లు, ఎగుమతి సంస్థలు సమన్వయంతో ముందుకు వస్తే తెలంగాణ ప్రపంచ బియ్యం ఎగుమతి కేంద్రంగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఒలింపిక్ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

**(మొదటి పేజీ తరువాయి)**

సమాజంలో ఐక్యత పెంపొందించేందుకు కూడా దోహదపడతాయని అన్నారు.

యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని రాష్ట్రానికి, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాస్ఫూర్తి జీవితంలో విజయాలకు పునాది అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.

ఒలింపిక్ డే రన్ ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచే ప్రయత్నం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, విద్యార్థులు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసి యువతను ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.




# 36 మంది డీఎస్పీలకు పోస్టింగ్ ఉత్తర్వులు

**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్ సోమవారం పదోన్నతి పొందిన 36 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) పోస్టింగ్ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, ప్రజల పట్ల మరింత బాధ్యత పెరగడమని అన్నారు. డీఎస్పీలుగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని పెంపొందించడం వంటి కీలక బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.



ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చట్టబద్ధంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం అందించాలని చెప్పారు. తమ ఆధ్వర్యంలోని పోలీసు బృందాలకు ఆదర్శంగా నిలుస్తూ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాలని సూచించారు. తెలంగాణ పోలీసు శాఖ విలువలను ప్రతి నిర్ణయంలో ప్రతిబింబించేలా పనిచేయాలని డీజీపీ పేర్కొన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజాసేవే పోలీసు శాఖ ప్రధాన ధ్యేయమని గుర్తుంచుకోవాలని అన్నారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కులను కాపాడటం పోలీసు అధికారుల అత్యున్నత బాధ్యత అని డీజీపీ స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేస్తూ సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పదోన్నతి పొందిన అధికారులు తమ కొత్త బాధ్యతల్లో సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని, శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆకాంక్షించారు.

# ఏరువాకతో ఖరీఫ్‌కు శ్రీకారం

**(మొదటి పేజీ తరువాయి)**

సాగునీటి వసతుల కల్పన, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రైతులకు అన్ని విధాలా అండగా ప్రభుత్వం నిలుస్తోందని వివరించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలని మంత్రి రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటిస్తూ పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రకృతి అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి అన్ని పంటలు క్రిమి, కీటకాల బెడద లేకుండా బాగా పండాలని, రైతులకు మంచి ఆదాయం రావాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులతో కలిసి మంత్రి వ్యవసాయ పనుల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏరువాక పౌర్ణమి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ రైతులకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఓటరు జాబితాపై కవిత ప్రశ్నలు



**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై పలు సందేహాలు వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో టీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాల సవరణలో పారదర్శకత ఉండాలని, ఎన్నికల సంఘం అన్ని ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని కవిత ఆరోపించారు. కర్ణాటకలోని సెడం నియోజకవర్గానికి చెందిన సుమారు 11 వేల మంది ఓటర్లు కొడంగల్ ఓటరు జాబితాలో కూడా ఉన్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని చెప్పారు. కొడంగల్‌లో మొత్తం 22 వేలకు పైగా డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, వాటిపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలపై ఇలాంటి ఓట్లు ప్రభావం చూపే అవకాశం ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

బోధన్ నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలంలో ఏడు వేలకుపైగా ఓట్లను తొలగించగా, కొడంగల్‌లో మాత్రం కేవలం 808 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత పేర్కొన్నారు. ఈ వ్యత్యాసానికి కారణమేంటో ఎన్నికల సంఘం ప్రజలకు వివరించాలని కోరారు. ఓటర్లను తొలగించే ముందు ఎన్నికల నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేశారా లేదా అన్న విషయాన్ని కూడా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇంటర్‌స్టేట్ డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించే వ్యవస్థ ఎన్నికల సంఘం వద్ద ఉందా లేదా అన్నది స్పష్టం చేయాలని కవిత అన్నారు. అలాంటి వ్యవస్థ లేకపోతే భారీ వ్యయంతో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఆశించిన ఫలితాలు రావని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండే విధంగా 'వన్ నేషన్-వన్ ఓటు' విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

దేశంలో రాష్ట్రాల మధ్య వలసలు, సంచార జాతుల ఓటర్ల నమోదు, డూప్లికేట్ ఓట్ల నివారణ వంటి అంశాలపై ఎన్నికల సంఘం శాశ్వత విధానాన్ని రూపొందించాలని కవిత కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం పేరుకే కాకుండా దేశవ్యాప్తంగా పారదర్శక ఓటరు జాబితాల రూపకల్పనకు ఉపయోగపడాలని అన్నారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు ఉండేలా, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉండకుండా సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త రాజకీయ పార్టీగా తమకు స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు అత్యంత ముఖ్యమని కవిత పేర్కొన్నారు. తాము లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమగ్ర సమాధానం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాల తయారీపై ప్రజల్లో ఎలాంటి సందేహాలు లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# శిల్పకళా వేదికలో రైతు భరోసా సదస్సు

**(మొదటి పేజీ తరువాయి)**

కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు మార్చి నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జూన్ 30న సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని రైతు భరోసా పథకం అమలుకు సంబంధించిన కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే ప్రక్రియపై ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నాయి.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల రైతులు, రైతు వేదికల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రాలు, మండల స్థాయిలో ప్రత్యేక ప్రసార ఏర్పాట్లు చేసి ఎక్కువ మంది రైతులు కార్యక్రమాన్ని వీక్షించేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు పథకం అమలుపై పూర్తి అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వర్షాల కారణంగా మధిరలో సభ నిర్వహించడం సాధ్యంకాకపోవడంతో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమానికి వచ్చే రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు భద్రత, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చే రైతుల రాకపోకలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను కూడా కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖలు అన్ని ఏర్పాట్లను తుది దశకు తీసుకెళ్లాయి. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సదస్సు తెలంగాణ వ్యవసాయ రంగంలో కీలక ఘట్టంగా నిలవనుంది.

# బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంత రహదారి దుస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు తెలిపారు. రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి ప్రయాణానికి అనువుగా మార్చాలని వారు అధికారులను కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దెబ్బతిన్న గ్రామీణ రహదారుల మరమ్మతులకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే ఇలాంటి ఘటనలు పునరావృతమై ప్రజలు, విద్యార్థులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## సకాల వర్షాల కోసం భక్తుల సామూహిక శివాభిషేకం

**జమ్మికుంట టౌన్ జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ జమ్మికుంట పట్టణంలోని బొమ్మలగుడి శివాలయంలో అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రత్యేక రుద్రాభిషేకం, శివపారాయణం, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో ప్రజలందరి సంక్షేమం కోసం పరమశివుడిని ప్రార్థిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పరమశివుని కటాక్షంతో జమ్మికుంటతో పాటు తెలంగాణ వ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చందా రాజు, లెంకలపల్లి శరత్, యాంసాని సురేష్, రవీందర్ రెడ్డి, రఘు, చంద్రమౌళి శ్రీనివాస్, రాజన్న, శివశంకర్, అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు, ఇతర సేవాసమితుల ప్రతినిధులు, ఆలయ అర్చకులు, శివభక్తులు తదితరులు పాల్గొన్నారు.



## యూట్యూబ్ వీడియోలతో హత్యకు స్కెచ్.. 24 గంటల్లో హంతకుని అరెస్ట్

**జమ్మికుంట టౌన్ జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం అంకుశాపూర్ హత్య కేసును పోలీసులు కేవలం రెండు రోజుల్లోనే ఛేదించారు. వ్యక్తిగత కక్షతో హత్యకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన ఆయుధంతో పాటు పలు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు హుజురాబాద్ డివిజన్ ఏసీపీ వి. మాధవి వెల్లడించారు. సోమవారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం... జమ్మికుంట మండలం మడిపెల్లి గ్రామానికి చెందిన గంగారపు మహేష్ (40)ను సోమవారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించగా, పైతరి మొగిలిని తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. తన వ్యవసాయ భూమి సమీపంలో వ్యవసాయం చేస్తున్న ఓ వివాహిత మహిళపై మృతుడు గతంలో అత్యాచారయత్నానికి పాల్పడగా, బాధితురాలికి అండగా నిలిచి పోలీసులకు ఫిర్యాదు చేయించినట్లు నిందితుడు తెలిపాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి విడుదలైన తర్వాత మృతుడు తరచూ తనను అవమానించడం, దూషించడం, కుటుంబ సమస్యలకు కూడా కారణమవుతున్నాడనే భావనతో అతనిపై కక్ష పెంచుకున్నట్లు వెల్లడించాడు. ఈ నెల 27న పీర్ల పండుగ సందర్భంగా మడిపెల్లి గ్రామానికి వచ్చిన మొగిలిని గమనించిన మహేష్, ముందుగానే యూట్యూబ్‌లో హత్యలకు సంబంధించిన వీడియోలు, ఆయుధాల తయారీ విధానాలు పరిశీలించి పథకం రచించాడు. అనంతరం అంకుశాపూర్ వెళ్లే రహదారిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు.
నిందితుడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, రక్తపు మరకలున్న లుంగీ, నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్, యూట్యూబ్ శోధనలు చేసిన మోటరోలా ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్, ఘటనలో ఉపయోగించిన హీరో ప్యాషన్ ప్రో మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
కేసు దర్యాప్తులో విశేష కృషి చేసిన జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్సై రవి, ఏఎస్ఐ సంపత్‌తో పాటు దర్యాప్తు బృందంలోని పోలీసు అధికారులను, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజలు సంఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్సై రవి, ఏఎస్ఐ సంపత్‌తో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భీమదేవరపల్లిలో గ్రామ సమాఖ్య మండలి భవనానికి భూమి పూజ

**భీమదేవరపల్లి, జూన్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** భీమదేవరపల్లి మండల కేంద్రంలో గ్రామ సమాఖ్య మండలి నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. MPDO వీరేశం ఆధ్వర్యంలో సర్పంచ్ మాచర్ల కుమారస్వామి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సమాఖ్య కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక భవనం ఏర్పాటు చేయడం గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో APM వేణు, ఉపసర్పంచ్ శనిగరం ఐలయ్య, CC అశోక్, వార్డు సభ్యులు సంధ్య, లలిత, విజయ, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్యామ్, గ్రామ కార్యదర్శి మోహన్, సీఏలు కవిత, రాణి, లక్ష్మి, శ్వేతా, శారద, విమల, శ్రీనివాస్, కరుణాకర్, రవ్వయ్య తదితరులు పాల్గొన్నారు.



## పదో తరగతి ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్యవైశ్య మహాసభ ఘన సన్మానం

**ఖమ్మం బ్యూరో , జూన్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆదివారం రాత్రి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మంలోని మమతా కాలేజీ రోడ్డులో ఉన్న పసుమర్తి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.
విద్యా కమిటీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతా చందర్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోళ్ళ రాధాకృష్ణమూర్తి, ముఖ్య సమన్వయకర్త చారుగుండ్ల నరసింహమూర్తి, విశిష్ట



ఫౌండేషన్ ప్రతినిధి గుర్రం సీత, స్టెమ్స్ పార్క్ జూనియర్ కాలేజ్ అధినేత కొండా శ్రీధర్, పసుమర్తి ఫంక్షన్ హాల్ అధినేత పసుమర్తి రామచంద్రరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం కుటుంబానికే కాకుండా సమాజానికీ గర్వకారణమని పేర్కొన్నారు. కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని, విద్యార్థులు లక్ష్యసాధనలో నిరంతరం శ్రమించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు విద్యా కమిటీ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యక్షులు వేమిశెట్టి మోహన్ దాస్, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, వెచ్చా రామకృష్ణ, దాచేపల్లి రామకృష్ణతో పాటు కమిటీ సభ్యులు విశేషంగా కృషి చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆర్యవైశ్య నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సన్మానం పొందిన విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఇలాంటి ప్రోత్సాహం మరింత ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

## జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బి. భిక్షపతికి ఘన వీడ్కోలు

**ఖమ్మం బ్యూరో , జూన్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బి. భిక్షపతి పదవీ విరమణ పొందిన సందర్భంగా, ఖమ్మం జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కేజీపిఏ ) ఆధ్వర్యంలో వారికి ఘనంగా వీడ్కోలు పలికి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు నాయకత్వంలో జీసీ సభ్యులు, సీనియర్ సభ్యులు కలిసి భిక్షపతిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి, వారి విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ, టాక్స్ ప్రొఫెషనల్స్ అందించిన సహాయ సహకారాలు మరువలేనివని, దేశ ఆర్థికాభివృద్ధికి టాక్స్ ప్రొఫెషనల్స్ మూలస్తంభాలుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. విధి



నిర్వహణలో ఎదురైన అనుభవాలను సభ్యులతో పంచుకుంటూ, సహోద్యోగులు, అధికారులు, టాక్స్ ప్రొఫెషనల్స్ అందరి సహకారంతో ఎంతో సంతృప్తికరంగా తన సేవా కాలాన్ని పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందడం ఆనందంగా ఉందని తెలిపారు. కే జి పి ఏ అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు మాట్లాడుతూ, భిక్షపతి తమ సేవాకాలంలో నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండే విధానంతో విశేష గుర్తింపు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించాలని అసోసియేషన్ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దుర్గాప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, మాజీ అధ్యక్షుడు కె. రామకృష్ణ, జీసీ సభ్యుడు ఎన్. రామకృష్ణ, సీనియర్ సభ్యులు శ్రీనివాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

- **బాపూజీ చేనేత సహకార సంఘానికి వొడితల ప్రణవ్ పూర్తి మద్దతు**

**హుజురాబాద్, జూన్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల బలోపేతం, సంప్రదాయ చేనేత వృత్తి పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. రాంపూర్-రంగాపూర్ గ్రామాల్లోని బాపూజీ చేనేత సహకార సంఘాన్ని సోమవారం ఆయన సందర్శించి, ఇటీవల నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రణవ్ మాట్లాడుతూ, చేనేత రంగం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు.



అనేక కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఈ రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సహకార సంఘాలు బలోపేతం అయితేనే చేనేత కార్మికులకు ఆర్థిక భద్రతతో పాటు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ముడి సరుకుల లభ్యత, ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. చేనేత సహకార సంఘాల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇటీవల ఎన్నికైన నూతన పాలకవర్గం ఐక్యంగా పనిచేసి సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించిన ప్రణవ్, సభ్యులంతా చేనేత రంగ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముషం వెంకట నారాయణ, ఉపాధ్యక్షుడు జడల వెంకటేశ్వర్లు, కోశాధికారి ముషం రవి, సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రభులింగం, సదానందం, శాంతయ్య, బండారి శోభా-సదానందం, పద్మ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం, జిల్లా అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు సజ్జు, గ్రామ శాఖల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రామచంద్రం, నరసింహారెడ్డి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పాటకు ప్రాణం పోసిన సాయిచంద్‌కు ఘన నివాళి

**వనపర్తి, జూన్29(తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ జానపద గాయకుడు, తెలంగాణ ముద్దుబిడ్డ సాయిచంద్ వర్ధంతిని సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో జైభీమ్ స్వచ్ఛంద సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, ప్రముఖ కవి జనజ్వాల, మహనీయుల స్ఫూర్తి వేదిక కన్వీనర్ గంధం నాగరాజు తదితరులు పాల్గొని సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. పల్లె పాటకు ప్రాణం పోసి, తెలంగాణ సంస్కృతి, భాష, యాసను తన గానంతో ప్రపంచానికి చాటిచెప్పిన అరుదైన కళాకారుడు సాయిచంద్ అని కొనియాడారు. ఆయన ఆలపించిన ప్రతి పాటలో పల్లె సొగసు, మట్టి పరిమళం, రైతు జీవితపు కష్టసుఖాలు ప్రతిబింబించేవని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన గానం ప్రజల్లో చైతన్యాన్ని నింపి ఉద్యమ స్ఫూర్తిని రగిలించిందన్నారు.ప్రముఖ కవి జనజ్వాల మాట్లాడుతూ సాయిచంద్ గొప్ప గాయకుడే కాకుండా నిరాడంబర వ్యక్తిత్వం కలిగిన మంచి మనిషి అని అన్నారు.ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, తన పాటల రూపంలో ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలిపారు.మహనీయుల స్ఫూర్తి వేదిక కన్వీనర్ గంధం నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సాయిచంద్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన పాటలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జైభీమ్ స్వచ్ఛంద సేవా సంఘం సభ్యులు, సాహితీవేత్తలు, కళాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



**జమ్మికుంట టౌన్,జూన్29(తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గడ్డం సుధాకర్‌ను జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీ తనంతో కూడిన పరిపాలన అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొలకని రాజు, పోలు బిక్షపతి, పోల్నేని వేణుగోపాల్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అధికారుల సమావేశం



**భీమదేవరపల్లి,జూన్29(తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గౌరవ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఇచ్చిన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటును వేగవంతం చేసి, గ్రామాల భద్రతను మరింత పటిష్ఠం చేయాలని అధికారులు సూచించారు. గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముల్కనూరు ఎస్ఐ రాజు, వంగర ఎస్ఐ దివ్య ఎంపీవో, ఎంపీడీవో, ఎమ్మార్వోతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డిపై ప్రత్యేక పాట విడుదల




**వనపర్తి,జూన్29(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి ప్రజాసేవ, వనపర్తి అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను ప్రతిబింబించే ప్రత్యేక పాటను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి అభిమానుల ప్రోత్సాహంతో ఈ పాటను రూపొందించారు. పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, వనపర్తి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్ దర్శకత్వంలో కళాకారుడు చంద్రశేఖర్ ఆజాద్ ఈ పాటను రూపొందించారు.వనపర్తి పొత్తిళ్లలో వేవిండో అడుగిలా... ఆకుపచ్చ భూమిగా మార్చినులే వెలుగులా... మా గడపలల్లో తొడిగిన తోరణమైనావుగా... ఊరువాడకొచ్చిన పున్నమి వెలుగోలే... అంటూ సాగిన ఈ పాటలో డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి ప్రజా సేవా తపన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలతో ఆయనకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఆవిష్కరించారు.ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ వారి అభిమానాన్ని, ఆశీర్వాదాన్ని పొందారని పాటలో పేర్కొన్నారు. ప్రజలందరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజానాయకుడిగా ఆయనను ఈ పాటలో అభివర్ణించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి ప్రజా సేవా స్ఫూర్తిని ప్రతిబింబించే ఈ పాట ప్రజల్లో మరింత చైతన్యం నింపుతుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు ఎంట్ల రవి, లోకేష్, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై కాంగ్రెస్ ఫోకస్..
# రంగాపూర్‌లో వొడితల ప్రణవ్





**హుజురాబాద్, జూన్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా హుజురాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలో ఇంటింటికి జరుగుతున్న ఓటర్ల సర్వేను కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సోమవారం పరిశీలించారు. పార్టీ కోఆర్డినేటర్లు, స్థానిక నాయకులతో కలిసి సర్వేలో పాల్గొని క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత కీలకమని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న సర్వేలో ప్రతి బీఎల్ఏ తప్పనిసరిగా పాల్గొని, ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని తెలిపారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతను ఓటరు జాబితాలో నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒక్క అర్హుడి పేరు కూడా జాబితా నుంచి గల్లంతు కాకుండా, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఈ సవరణ ప్రక్రియను అత్యంత నిశితంగా పరిశీలిస్తోందని, ప్రతి బూత్‌లో బీఎల్ఏలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో ఖచ్చితంగా రూపొందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటుకు అమూల్యమైన విలువ ఉందని, ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి రాజకీయ పార్టీతో పాటు ప్రతి కార్యకర్త బాధ్యత అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్ ప్రక్రియ కోఆర్డినేటర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు, గ్రామ కోఆర్డినేటర్లు, బూత్ ఏజెంట్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో
# రైతు ఆశీర్వాద సభ వాయిదా..





డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం బ్యూరో , జూన్ - 29(తెలంగాణ ముచ్చట్లు ):** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈనెల 30న చింతకాని మండలం జగన్నాధపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడాతూ, వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా హజరవనున్న రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు.

రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సభను వాయిదా వేస్తోందని పేర్కొన్నారు. తొలుత ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని భావించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జూలై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, పరిస్థితులు అనుకూలిస్తే జూలై 6, 7 లేదా 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఈ సభపై విశేష ఆసక్తి చూపుతున్నారని, వాతావరణం అనుకూలించిన వెంటనే నిర్వహించే రైతు ఆశీర్వాద సభ ప్రజలు ఊహించని స్థాయిలో విజయవంతం అవుతుందని డిప్యూటీ సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు తెలిపారు. రైతుల భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

వర్షం అడ్డొచ్చినా రైతు సంక్షేమం ఆగదని, రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని,

మంగళవారం హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతు బంధు కింద రూ. 72 వేల కోట్లు అందించగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని అన్నారు. యూరియా పంపిణీ కోసం రూపొందించిన యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతూ ఉన్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్నిరకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, ఈ పాలనలో తెలంగాణలో రైతు రాజ్యం సాకారమై దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డిఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సకాల వర్షాలకై వెల్టూరులో ఘట్టాభిషేకం

**పెద్దమందడి,జూన్29(తెలంగాణ ముచ్చట్లు):** జ్యేష్ఠ పౌర్ణమి సోమవారం సందర్భంగా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని స్వయంభూ శ్రీ సిద్ధి రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఘట్టాభిషేకం (గంగాభిషేకం)ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని స్వామి వారిని ప్రత్యేకంగా ప్రార్థించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రధాన పూజారి శివకుమార్ ఆధ్వర్యంలో పవిత్ర జలాలతో స్వామివారికి ఘట్టాభిషేకం నిర్వహించి, అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. గ్రామ శ్రేయస్సు, సకాల వర్షాలు, పంటల సమృద్ధి కోసం ఈ ప్రత్యేక ఘట్టాభిషేకాన్ని నిర్వహించినట్లు ఆలయ పూజారి శివకుమార్ తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల ప్రగతికి పునాది...

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం బ్యూరో, జూన్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** సహకార బ్యాంకులు రైతులకు, గ్రామీణ ప్రజలందరికీ ఆర్థిక పరంగా అండగా నిలుస్తూ, పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు పట్టణంలో సోమవారం ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కల్లూరు బ్రాంచ్ నూతన భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులకు మరింత చేరువలో, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కల్లూరులో నూతన భవనంలో డీసీసీబీ శాఖను ప్రారంభించామని తెలిపారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సహకార బ్యాంకులు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతుల ఆదాయం పెరిగి, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కల్లూరు బ్రాంచ్ ఆర్థికంగా బలమైన శాఖగా ఎదగడానికి వ్యాపారవేత్తలు, ప్రజలు తమ డిపాజిట్లను సహకార బ్యాంకులోనే ఉంచేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బ్యాంకు బలోపేతమైతే స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న మంత్రి, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందన్నారు. కల్లూరుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేస్తూ, త్వరలో ఇంటిగ్రేటెడ్ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఆధునిక పరిపాలనా సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు. కల్లూరు మండలంలో సాగునీరు, తాగునీరు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మౌళిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. గతంలో మండల కార్యాలయాలు, కళాశాల భవనాలు, నీటి పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

వేంసూరులో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభమైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. ఖమ్మం-అశ్వారావుపేట పాత రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. అలాగే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ఎగ్జిట్, ఇతర మౌళిక వసతుల కల్పనకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంచి పేరును మరింత పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏ అవకాశం వచ్చినా ముందుగా సత్తుపల్లి నియోజకవర్గానికి తీసుకురావడానికి కట్టుబడి ఉంటానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంక్ ప్రయివేట్ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే ఋణాలందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. రైతులకు ఎన్ని రకాల రుణాలు వస్తాయో అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, ఏసీపీ వసుంధర యాదవ్, బ్యాంక్ సిఇఓ ఎన్. వెంకట ఆదిత్య, డిజిఎం ఎం. సర్వేశ్వర రావు, ఎజిఎం బి. చందర్ రావు, మేనేజర్ ఎం. అనిత, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాగం నీరజ, కల్లూరు మునిసిపల్ చైర్మన్ ఎం. మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశం కింద..



ఈ దారులన్నీ
కాలేజీ వైపే పోతాయనుకుంటారు...

కాదు.
కొన్ని దారులు
తల్లిదండ్రుల గుండెల్లోంచి
నేరుగా
పిల్లల భవిష్యత్తులోకి పోతాయి.

నెత్తిమీద
పెట్టెలు కనిపిస్తాయి
ఎవరూ చూడరు గానీ,

వాటి కింద
ఏళ్ల తరబడి మోసిన అప్పులు
ఉంటాయి
అణచుకున్న ఆశలు ఉంటాయి
వాయిదా పడిన జీవితాలు ఉంటాయి.

ఆకాశమంతా
నెత్తిన పెట్టుకుని
నడుస్తున్నాడు తండ్రి.

తలపై ఉన్నది పెట్టె కాదు
బాధల బరువు.
బాధ్యతల భారం.
ఇంట్లో అమ్మ దాచిన ఆకలి.

ఈ దేశంలో
ప్రతి డిగ్రీ సర్టిఫికెట్ వెనుక
ఒక మధ్యతరగతి తండ్రి
చిరిగిపోయిన చొక్కా ఉంటుంది
చెమటతో చెల్లించిన చరిత్ర ఉంటుంది.

ఒక తల్లి
దాచుకున్న ఆకలి ఉంటుంది
దిగమింగుకున్న దుఃఖం ఉంటుంది.

ఒక కుటుంబం
వాయిదా వేసుకున్న వర్తమానం
ఉంటుంది
పణంగా పెట్టిన భవిష్యత్తు ఉంటుంది.

**- బసడ సంపత్ యాదవ్**
7032132593

## ములుకనూరు సహకార సంఘంలో ఏ.కె. విశ్వనాథ రెడ్డి

# ఘనంగా 40వ వర్ధంతి కార్యక్రమం




**భీమదేవరపల్లి, జూన్ 29(తెలంగాణ ముచ్చట్లు):** ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటి లిమిటెడ్ ఆవరణలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కీ.శే. ఏ.కె. విశ్వనాథ రెడ్డి గారి 40వ వర్ధంతి కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షులు ఎ. ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘ సీనియర్ సభ్యులు రఘునాయకుల బాల్ రెడ్డి (వంగర), దొంగల అయిలయ్య (ములుకనూరు)లు ఏ.కె. విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షులు ఎ. ప్రవీణ్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఈ సందర్భంగా ఎ. ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, గత 70 ఏళ్లుగా ములుకనూరు సహకార సంఘం సాధించిన ప్రగతికి వ్యవస్థాపక అధ్యక్షులు ఏ.కె. విశ్వనాథ రెడ్డి వేసిన బలమైన పునాదులే కారణమని అన్నారు. నేడు సంఘం ఆధునిక సేవలతో సభ్యులకు సమర్థవంతంగా సేవలందిస్తోందని, సంఘం పారదర్శకత, అభివృద్ధి, వినూత్న సేవలను అధ్యయనం చేసేందుకు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు సైతం ములుకనూరు సహకార సంఘాన్ని సందర్శించడం గర్వకారణమని పేర్కొన్నారు.

భీమదేవరపల్లి మండలంలో అత్యధిక సంఖ్యలో బహిరంగ బావులు ఏర్పడటానికి సహకార సంఘం ప్రారంభ దశ నుంచే రైతులకు అందించిన వ్యవసాయ రుణాలే ప్రధాన కారణమని తెలిపారు. వాటి ద్వారా రైతుల ఆదాయం పెరిగి వ్యవసాయాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడిందన్నారు. సహకార భావనను పరిరక్షిస్తూ సంఘ అభివృద్ధికి ప్రతి సభ్యుడు ఐకమత్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి, ఉపాధ్యక్షులు గజ్జి వీరయ్య, కార్యవర్గ సభ్యులు ఈర్ల మూగయ్య, కంది రవిందర్ రెడ్డి, అంబాల రాములు, బేల కనుకమ్మ, చెవ్వల్ల బుచ్చయ్య, గుగ్లోతు బాషు, బొల్లపెల్లి వీరారెడ్డి, మంద శ్రీనివాస్, కర్రె మహేందర్, బొల్లంపెల్లి కుమారస్వామి, గనెబోయిన శ్రీనివాస్, గుర్రాల భాస్కర్ రెడ్డి, కాశిరెడ్డి వసంతతో పాటు సంఘ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అఫ్గాన్‌పై పాక్ భీకర వైమానిక దాడులు



**ఇస్లామాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** అఫ్గానిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ సైన్యం నిర్వహించిన వైమానిక దాడులు మరోసారి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచాయి. పక్తియా, పక్తికా, కునార్ ప్రావిన్స్‌లలో ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఈ దాడుల్లో 29 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ఇస్లామాబాద్ పేర్కొనగా, అమాయక పౌరులు మరణించారని అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. దాడుల్లో అత్యంత వివాదాస్పదంగా మారింది 'డబుల్ ట్యాప్' వ్యూహం. మొదటి వైమానిక దాడి అనంతరం శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు స్థానికులు, సహాయక సిబ్బంది చేరుకున్న సమయంలో అదే ప్రాంతంపై మరోసారి దాడులు జరిగినట్లు అఫ్గాన్ అధికారులు ఆరోపించారు. ఈ రెండో దాడిలోనే మరణాలు, గాయాల సంఖ్య భారీగా పెరిగినట్లు వారు వెల్లడించారు. ఈ విధానం అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలకు గురవుతోంది.

పాకిస్థాన్ మాత్రం తమ దాడులు పూర్తిగా ఉగ్రవాద సంస్థలపైనే జరిగాయని స్పష్టం చేసింది. ఇటీవల కరాచీలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. జమాత్‌ఉల్‌అహ్రార్, తెహ్రీక్‌ఇ తాలిబాన్ పాకిస్థాన్‌కు చెందిన స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఖచ్చితమైన దాడులు నిర్వహించామని, 29 మంది మిలిటెంట్లను హతమార్చినట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం మాత్రం పాకిస్థాన్ వాదనలను పూర్తిగా ఖండించింది. దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా కనీసం 36 మంది పౌరులు మరణించారని, 160 మందికిపైగా గాయపడినట్లు తెలిపింది. తమ భూభాగంలో ఉగ్రవాదులకు ఆశ్రయం లేదని, నివాస ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ దాడులు నిర్వహించిందని ఆరోపించింది.

2021లో తాలిబన్‌లు అఫ్గానిస్థాన్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాకిస్థాన్ తరచూ అఫ్గాన్ భూభాగంలో పనిచేస్తున్న మిలిటెంట్ గుంపులను కారణంగా చూపుతుండగా, కాబూల్ ప్రభుత్వం ఈ ఆరోపణలను నిరంతరం ఖండిస్తోంది. ఇటీవల నెలల్లో సరిహద్దు ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చి పలు దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకున్నాయి. తాజా ఘటనతో ప్రాంతీయ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ సమాజం ఇరు దేశాలు సంయమనం పాటించాలని, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని కోరుతోంది. అయితే సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉండటంతో భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# విరాళాల కేసులో కొత్త కోణాలు

- **నిందితుడి ఆస్తులపై పోలీసుల ఆరా**
- **తక్కువ జీతంతో విలాసవంతమైన జీవనం**
- **బ్యాంకు లావాదేవీలు, ఆస్తులపై దర్యాప్తు ముమ్మరం**



**లక్నో, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తులో ఉత్తరప్రదేశ్ పోలీసులకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో అరెస్టైన అనుకల్ప్ మిశ్రా అనే నిందితుడి ఆస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అతడి ఆదాయానికి మించిన స్థాయిలో ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించిన పోలీసులు, వాటి మూలాలపై లోతుగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు ప్రకారం 22 ఏళ్ల అనుకల్ప్ మిశ్రా నెలకు సుమారు రూ.15 వేల జీతం మాత్రమే పొందుతున్నప్పటికీ, ఇటీవల అయోధ్యలో రూ.65 లక్షల విలువైన ఇంటిని కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తన స్వగ్రామంలో ఫార్మ్‌హౌస్ నిర్మించడంతో పాటు ఖరీదైన ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. తాజాగా మరో విలాసవంతమైన కారు కొనుగోలు ప్రక్రియ కూడా ప్రారంభించినట్లు సమాచారం. మూడేళ్ల క్రితమే ఆలయానికి సంబంధించిన ఉద్యోగంలో చేరిన వ్యక్తి ఇంత తక్కువ సమయంలో ఇంత భారీ ఆస్తులు ఎలా సంపాదించాడన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అతడి ఆదాయం చట్టబద్ధమైన మార్గాల ద్వారానే వచ్చిందా లేదా విరాళాల దుర్వినియోగంతో సంబంధం ఉందా అనే అంశాలపై అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నారు. నిందితుడి నివాసంలో సోదాలు నిర్వహించిన దర్యాప్తు బృందం బ్యాంకు ఖాతాలు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆర్థిక రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తోంది. ఇటీవల అతడు నిర్వహించిన ఖరీదైన ధార్మిక కార్యక్రమాల ఖర్చులపై కూడా ఆరా తీస్తోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితిలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులపై స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. ఈ కేసులో అరెస్టైన ఇతర నిందితుల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఎవరికైనా ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయా, విరాళాల నిధులతో సంబంధం ఉందా అనే అంశాలపై సమగ్ర విచారణ కొనసాగుతోంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఆలయ నిధుల నిర్వహణపై కూడా విచారణ సంస్థలు దృష్టి సారించాయి. ఈ వ్యవహారంలో బాధ్యులెవరో పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం తేలనుంది. నిందితులపై లభించే ఆధారాల మేరకు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మట్టిని కాపాడితేనే.. మనుగడకు భరోసా

భూమిపై జీవరాశి మనుగడకు గాలి, నీరు ఎంత అవసరమో, సారవంతమైన మట్టి కూడా అంతే అవసరం. మనం తినే ప్రతి ఆహార పదార్థం మట్టిలోనే పుడుతుంది. అయినప్పటికీ మట్టిని కాపాడుకోవాల్సిన అవసరంపై సమాజంలో తగినంత అవగాహన కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, పారిశ్రామికీకరణ, రసాయనాల అధిక వినియోగం, అడవుల నరికివేత, భూగర్భ జలాల అధిక వినియోగం వంటి కారణాలతో భూసారం వేగంగా క్షీణిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే తరాలకు ఆహార భద్రతే సవాలుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ భూమి ఒకసారి తన సారాన్ని కోల్పోతే తిరిగి సహజ స్థితికి చేరుకోవడానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది. అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందులను విచక్షణారహితంగా వినియోగించడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశిస్తున్నాయి. దీంతో మట్టి సహజ సంతులనం దెబ్బతిని దిగుబడులు క్రమంగా తగ్గుతున్నాయి. ఒకప్పుడు తక్కువ ఎరువులతో మంచి పంటలు ఇచ్చిన భూములు, ఇప్పుడు అధిక పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితాలను ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. వాతావరణ మార్పులు కూడా భూమి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అసమయ వర్షాలు, భారీ వర్షాలతో నేల కోత పెరుగుతోంది. మరోవైపు దీర్ఘకాలిక కరువు కారణంగా భూమి తేమను కోల్పోయి బీడుగా మారుతోంది. వరదలు, గాలివానలు, అధిక ఉష్ణోగ్రతలు మట్టి నాణ్యతను మరింత దెబ్బతీస్తున్నాయి. వ్యవసాయంతో పాటు జీవవైవిధ్యంపైనా దీని ప్రభావం పడుతోంది. అడవుల నరికివేత కూడా మట్టి క్షీణతకు ప్రధాన కారణంగా మారింది. చెట్లు లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా భూమిపై పడుతూ సారవంతమైన పైపొరను కొట్టుకుపోయేలా చేస్తోంది. కొండ ప్రాంతాల్లో నేలచరియలు పెరగడం, నదుల్లో మట్టి పేరుకుపోవడం, చెరువుల సామర్థ్యం తగ్గిపోవడం వంటి సమస్యలకు కూడా ఇదే కారణం. అందుకే వృక్ష సంపదను పెంచడం మట్టి పరిరక్షణలో కీలక చర్యగా భావించాలి. భూసారాన్ని కాపాడేందుకు సేంద్రియ వ్యవసాయం, పంటల మార్పిడి, ఆకుపచ్చ ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులు, వర్షపు నీటి సంరక్షణ, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం వంటి చర్యలను రైతులు మరింతగా అనుసరించాలి. ప్రభుత్వం కూడా ఈ దిశగా అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక సహాయం, ప్రోత్సాహకాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. మట్టి పరిరక్షణ అనేది కేవలం రైతుల బాధ్యత కాదు. పరిశ్రమలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సాధారణ ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను భూమిలో వేయకుండా ఉండటం, చెట్లను నాటడం, చెరువులను కాపాడడం, భూమి కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దోహదపడతాయి.

ప్రపంచంలో ఆహార అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న వేళ భూమి సారాన్ని కాపాడుకోవడం అత్యంత కీలకంగా మారింది. సారవంతమైన నేల ఉంటేనే రైతు బతుకుతాడు, రైతు బతికితేనే దేశానికి ఆహార భద్రత ఉంటుంది. అందుకే మట్టి సంరక్షణను ఒక పర్యావరణ కార్యక్రమంగా కాకుండా దేశ భవిష్యత్‌కు సంబంధించిన జాతీయ బాధ్యతగా చూడాల్సిన సమయం ఆసన్నమైంది. భూమి మన పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి కాదు.. భావితరాల నుంచి అప్పుగా తీసుకున్న అమూల్యమైన సంపద. దానిని నాశనం చేయడం కాదు, మరింత సారవంతంగా మార్చి తర్వాతి తరాలకు అందించడం మనందరి బాధ్యత. మట్టిని కాపాడితేనే మనుగడకు భరోసా ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉంది.

# పౌర బాధ్యతతోనే పరిశుభ్రమైన భారత్

స్వచ్ఛమైన పరిసరాలు, ఆరోగ్యవంతమైన ప్రజలు, అభివృద్ధి చెందిన సమాజం.. ఈ మూడు ఒకదానితో ఒకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. పరిశుభ్రత అనేది కేవలం వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు.. అది దేశాభివృద్ధికి కొలమానం కూడా. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే అక్కడి ప్రజలు పరిశుభ్రతను ఒక విధిగా కాకుండా తమ జీవన సంస్కృతిలో భాగంగా మార్చుకున్నారు. మన దేశంలో కూడా పరిశుభ్రమైన భారత నిర్మాణం కోసం అనేక కార్యక్రమాలు అమలవుతున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రావాలంటే ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఎన్ని పథకాలు తీసుకొచ్చినా, ప్రజల సహకారం లేకుండా పరిశుభ్రమైన దేశాన్ని నిర్మించడం సాధ్యం కాదు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. మౌలిక వసతులు, పరిశ్రమలు, సాంకేతిక రంగం, అంతరిక్ష పరిశోధనలు, డిజిటల్ సేవలు వంటి అనేక రంగాల్లో దేశం ముందుకు సాగుతోంది. అయితే అభివృద్ధితో పాటు పరిశుభ్రత కూడా సమానంగా ఉండాలి. నగరాల్లో పెరుగుతున్న జనాభా, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు, పెరుగుతున్న వినియోగ సంస్కృతి కారణంగా ప్రతి రోజూ లక్షల టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని సక్రమంగా నిర్వహించకపోతే పర్యావరణ కాలుష్యం పెరగడమే కాకుండా ప్రజారోగ్యం కూడా ప్రమాదంలో పడుతుంది.



మన దైనందిన జీవితంలో చిన్నచిన్న నిర్లక్ష్యాలే పెద్ద సమస్యలకు కారణమవుతున్నాయి. రోడ్లపై ప్లాస్టిక్ కవర్లు, నీటి సీసాలు, ఆహార వ్యర్థాలు, గుట్కా ప్యాకెట్లు, పండ్ల తొక్కలు, నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయడం సాధారణంగా మారింది. ఒక వ్యక్తి చేసిన చిన్న తప్పు సమాజానికి పెద్ద సమస్యగా మారుతుంది. కాలువలు మూసుకుపోవడం, వర్షపు నీరు నిలిచిపోవడం, దోమలు పెరగడం, దుర్వాసన వ్యాపించడం వంటి సమస్యలు చివరకు అందరినీ ఇబ్బంది పెడతాయి. కాబట్టి ప్రజా ప్రదేశాలను సొంత ఆస్తిలా భావించి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. వర్షాకాలంలో పరిశుభ్రత మరింత కీలకమవుతుంది. కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల వర్షపు నీరు సక్రమంగా వెళ్లక రహదారులు జలమయం అవుతాయి. నిల్వ నీటిలో దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో కలుషిత నీరు కారణంగా విరేచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు కూడా పెరుగుతాయి. ఈ పరిస్థితులను నివారించాలంటే ఇంటి పరిసరాలను, కాలనీలను, గ్రామాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడం అత్యంత అవసరం.ప్లాస్టిక్ కాలుష్యం ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద పర్యావరణ సమస్యల్లో ఒకటి. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులు వందల సంవత్సరాల పాటు భూమిలోనే ఉండి నేల, నీరు, జీవరాశిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. నదులు, చెరువులు, సముద్రాల్లోకి చేరే ప్లాస్టిక్ వ్యర్థాలు జలచరాల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. అందుకే ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు, లోహం లేదా గాజుతో తయారైన పునర్వినియోగ వస్తువులను ఉపయోగించడం ప్రతి పౌరుడి బాధ్యతగా మారాలి. వ్యర్థాల నిర్వహణలో ప్రజల పాత్ర అత్యంత కీలకం. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్, గాజు, లోహ వ్యర్థాలను వేర్వేరుగా సేకరిస్తే వాటిని తిరిగి వినియోగించడం సులభమవుతుంది. ఇంటి నుంచే వ్యర్థాలను వేరు చేయడం వల్ల మున్సిపల్ సంస్థలపై భారం తగ్గుతుంది. సేంద్రియ వ్యర్థాలతో ఎరువులు తయారు చేయడం, ప్లాస్టిక్‌ను పునర్వినియోగానికి పంపించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందవచ్చు.

పిల్లల్లో పరిశుభ్రత అలవాట్లను చిన్న వయసులోనే పెంపొందించాలి. పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తే విద్యార్థులు మంచి అలవాట్లను నేర్చుకుంటారు. ఇంట్లో తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. కుటుంబంలో ప్రారంభమైన పరిశుభ్రత సంస్కృతి సమాజమంతటికీ విస్తరిస్తుంది. భవిష్యత్ తరాలను పరిశుభ్రత పట్ల బాధ్యతాయుతంగా తీర్చిదిద్దడం మనందరి కర్తవ్యం. స్థానిక సంస్థలు కూడా తమ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలి. చెత్త సేకరణ, మురుగు నీటి పారుదల, కాలువల శుభ్రత, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, చెత్త శుద్ధి కేంద్రాల ఏర్పాటు వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించాలి. అదే సమయంలో ప్రజలు కూడా చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వేయడం, పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గౌరవించడం, స్థానిక సంస్థలకు సహకరించడం ద్వారా పరిశుభ్రత కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, ఆర్థికాభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుంది. పరిశుభ్రమైన నగరాలు పెట్టుబడులను ఆకర్షిస్తాయి. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. ప్రజల వైద్య ఖర్చులు తగ్గుతాయి. పని సామర్థ్యం పెరుగుతుంది. పరిశుభ్రత వల్ల ప్రభుత్వంపై పడే ఆరోగ్య వ్యయం కూడా తగ్గుతుంది. అంటే పరిశుభ్రత అనేది ఖర్చు కాదు.. భవిష్యత్‌పై పెట్టుబడి. ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయిలో భారత్ అభివృద్ధి చెందాలంటే కేవలం ఆర్థిక రంగంలోనే కాదు, పరిశుభ్రతలో కూడా ఆదర్శంగా నిలవాలి. విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి పరిశుభ్రతను మెచ్చుకునే మనం, మన దేశంలో కూడా అదే బాధ్యతతో వ్యవహరించాలి. చట్టాలు, జరిమానాలు భయపెట్టవచ్చు కానీ శాశ్వత మార్పును తీసుకురావేది పౌరులలోని బాధ్యతా భావమే. ప్రతి వ్యక్తి తన ఇంటి ముందు, తన వీధిలో, తన గ్రామంలో లేదా తన కాలనీలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తే దేశమంతా స్వచ్ఛంగా మారుతుంది.

పరిశుభ్రమైన భారత్ నిర్మాణం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదు.. అది ప్రతి భారతీయుడి జాతీయ బాధ్యత. రోడ్డు మీద చెత్త వేయకుండా ఉండడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్లను సంరక్షించడం, నీటి వనరులను కలుషితం చేయకుండా కాపాడడం, ప్రజా ఆస్తులను రక్షించడం వంటి చిన్నచిన్న చర్యలే గొప్ప మార్పుకు నాంది పలుకుతాయి. పరిశుభ్రతను ఒక అలవాటుగా, ఒక విలువగా, ఒక సంస్కారంగా ప్రతి కుటుంబం స్వీకరించిన రోజే నిజమైన స్వచ్ఛ భారత్ లక్ష్యం సాకారం అవుతుంది. పౌర బాధ్యతతో ముందడుగు వేస్తేనే ఆరోగ్యవంతమైన, అందమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని భావితరాలకు అందించగలం.

# జమలాపురం వెంకన్నను దర్శించుకున్న భట్టి

- ధ్వజస్తంభ మహా కుంభాభిషేకంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి
- రాష్ట్ర ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు
- సతీసమేతంగా స్వామివారి ఆశీస్సులు పొందిన భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.
ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందించారు. ఆలయ మర్యాదల ప్రకారం తీర్థప్రసాదాలు అందజేశారు.
ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించాలని స్వామివారిని మనస్ఫూర్తిగా వేడుకున్నట్లు పేర్కొన్నారు. ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి మహోత్సవాలు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, వేదపారాయణాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

# ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన మంత్రి

- ఏలబోతారంలో ఎస్ఐఆర్‌పై క్షేత్రస్థాయి తనిఖీ
- అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయాలని ఆదేశం
- గ్రామస్తులకు అవగాహన కల్పించిన పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలం ఏలబోతారం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరిశీలించారు. ఇంటింటికీ జరుగుతున్న ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తూ బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లతో (బీఎల్ఏలు) మాట్లాడి ప్రక్రియ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.
2002, 2025 ఓటరు జాబితాలను ప్రామాణికంగా తీసుకుని ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారిని జాబితాలో చేర్చాలని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.
గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో నేరుగా మాట్లాడిన మంత్రి, ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించాలని అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండాలని అన్నారు. స్వచ్ఛమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే మాత్రమే ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# ఉపాధి హామీపై సీతక్క వినతి

- గ్రామీణాభివృద్ధి మంత్రుల సమావేశంలో సీతక్క
- ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌పై ప్రభావం చూపే నిబంధనలు సవరించాలని విజ్ఞప్తి
- పేదల ఉపాధి హక్కును పరిరక్షించాలని కేంద్రానికి లేఖ



**న్యూఢిల్లీ, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన సోమవారం ఢిల్లీలో జరిగిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రుల సమావేశంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూలై 1, 2026 నుంచి అమల్లోకి రానున్న 'వీబీజీ రామ్ జీ' చట్టం వల్ల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)పై పడే ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వ ఆందోళనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి సీతక్క లేఖను అందజేశారు. కొత్త నిబంధనల కారణంగా ఉపాధి హామీ పథకం అమలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, గ్రామీణ పేదల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడకుండా తగిన మార్పులు చేయాలని ఆమె కోరారు. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విధాన నిర్ణయాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే రాజ్యాంగబద్ధమైన హక్కుగా కొనసాగాలని సీతక్క పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఉపాధి లభిస్తోందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది కీలక ఆధారమని తెలిపారు. కొత్త నిబంధనల వల్ల పేదలకు ఇబ్బందులు కలగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని సీతక్క వివరించారు. పథకంలో ఉన్న లోపాలను సరిదిద్దితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు.
సమావేశంలో వివిధ రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి మంత్రులు తమ రాష్ట్రాల అనుభవాలు, సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. గ్రామీణ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. గ్రామీణ ఉపాధి హక్కు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన విధానపరమైన మార్పులు చేయాలని మంత్రి దనసరి సీతక్క సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

# జూలై 1 నుంచి కొత్త నిబంధనలు




**న్యూఢిల్లీ, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకింగ్, పన్నులు, ఆధార్, పాస్‌పోర్ట్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన పలు కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్య ప్రజల ఆర్థిక లావాదేవీలపై ప్రభావం చూపనున్నాయి.

**ఐటీఆర్ దాఖలుకు గడువు**

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నులను జూలై 31లోగా దాఖలు చేయాలి. ఐటీఆర్-1, ఐటీఆర్-2 దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు ఈ గడువు వర్తిస్తుంది. నిర్ణీత గడువు దాటితే జరిమానాతో పాటు కొన్ని పన్ను రాయితీలు కోల్పోయే అవకాశం ఉంది.

**ఆధార్‌లో ఉచిత ఈ-మెయిల్ అప్‌డేట్**

ఆధార్‌లో నమోదు చేసిన ఈమెయిల్ చిరునామాను ఇకపై ఉచితంగా మార్చుకునే అవకాశం కల్పించారు. ఆధార్ మొబైల్ అనువర్తనం ద్వారా ఈ సేవను 2026 డిసెంబర్ 31 వరకు ఎలాంటి రుసుము లేకుండా పొందవచ్చు.

**ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులకు కొత్త నిబంధనలు**

ఫోన్‌పే-ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల రివార్డు పాయింట్ల విధానంలో మార్పులు చేశారు. కొన్ని లావాదేవీలపై ఇకపై రివార్డు పాయింట్లు ఇవ్వరు. అలాగే నిర్దేశిత ఖర్చు పరిమితిని దాటిన తర్వాత మాత్రమే పాయింట్లు లభిస్తాయి. ఈ మార్పులు ఎంపిక చేసిన కార్డులకు మాత్రమే వర్తిస్తాయి.

**హెచ్‌డీఎఫ్‌సీ లాంజ్ సదుపాయంలో మార్పు**

హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు వినియోగదారులు ఒక త్రైమాసికంలో మూడు ఉచిత విమానాశ్రయ లాంజ్ ప్రవేశాలు పొందాలంటే, అంతకుముందు త్రైమాసికంలో కనీసం రూ.60 వేల వరకు ఖర్చు చేసి ఉండాలి.

**పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు**

జూలై 1 నుంచి సాధారణ, తక్షణ పాస్‌పోర్ట్ దరఖాస్తుల ఫీజులు పెరగనున్నాయి. దేశీయంగా, విదేశాల్లో దరఖాస్తు చేసుకునే వారందరికీ కొత్త రుసుములు వర్తిస్తాయి.

**బ్యాంకుల విక్రయ విధానంపై ఆర్‌బీఐ చర్య**

ఖాతాదారుల అవసరం లేకుండా బీమా, పెట్టుబడి పథకాలను బలవంతంగా విక్రయించకుండా బ్యాంకులపై నియంత్రణ కోసం భారతీయ రిజర్వు బ్యాంకు కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తీసుకువస్తోంది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.



# ఓటరు గణన ఫారాల పంపిణీ వేగవంతం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారులకు సీఈఓ సుధర్శన్ రెడ్డి ఆదేశాలు
- ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేయాలని సూచన
- అనధికార వ్యక్తులతో పంపిణీ చేయొద్దని స్పష్టం

**ములుగు, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గణన ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ గణన ఫారాలను బూత్ స్థాయి అధికారులు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో ఫారాల పంపిణీ చేయకూడదని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.
బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి గణన ఫారాలను పంపిణీ చేయాలని సీఈఓ పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన గణన ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన వివరాలు తెలియజేస్తూ ఫారాల సమర్పణలో సహకారం అందించాలని అధికారులకు సూచించారు. గణన ఫారాన్ని సమర్పించిన ఓటర్ల వివరాలు మాత్రమే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగించబడతాయని సుధర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అందువల్ల అర్హులైన ప్రతి ఓటరు నిర్ణీత గడువులోగా ఫారాన్ని సమర్పించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు, జాప్యాలకు తావు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గణన ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలు కూడా తమ గణన ఫారాలను సకాలంలో సమర్పించి ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు అభివృద్ధికి మైలురాయి: పొంగులేటి

- భూ సేకరణ, పునరావాసంపై మంత్రి సమీక్ష
- బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు ఆదేశాలు
- మానవీయ కోణంలోనే ప్రాజెక్టు అమలు చేస్తామని స్పష్టం



**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో భూ సేకరణ, పునరావాస అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ ఈ.వి. నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ప్రాజెక్టు అమలు పురోగతి, భూ సేకరణ, పునరావాస చర్యలపై సమగ్రంగా చర్చించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూసి నదిని పునరుజ్జీవింపజేసి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రహదారులు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాల అభివృద్ధితో మూసి పరివాహక ప్రాంతాలకు కొత్త రూపు తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. మూసి ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయాన్ని మానవీయ కోణంలోనే తీసుకుంటామని తెలిపారు. ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టును అమలు చేస్తామని అధికారులకు సూచించారు.
భూ సేకరణలో ప్రజల సమస్యలను సానుభూతితో పరిశీలించాలని, ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించేందుకు తక్షణ కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్‌కు కొత్త గుర్తింపు లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఏరోమార్ట్ సదస్సుకు హైదరాబాద్ సిద్ధం

**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. జూన్ 30 నుంచి జూలై 2 వరకు మూడు రోజుల పాటు 'ఏరోమార్ట్ హైదరాబాద్-2026' సదస్సు జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం, బీసీఐ ఏరోస్పేస్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా విమానయానం, రక్షణ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి.

ఈ కార్యక్రమానికి 25 దేశాల నుంచి 400కుపైగా అంతర్జాతీయ సంస్థలు, రక్షణ రంగ నిపుణులు హాజరవుతున్నారు. దాదాపు 1,200 మంది ప్రతినిధులు పాల్గొని ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో వస్తున్న సాంకేతిక మార్పులు, ఆవిష్కరణలు, పరిశ్రమల అభివృద్ధిపై చర్చించనున్నారు.

ఈ సదస్సు తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. స్థానిక పరిశ్రమలు విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరుచుకునేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఇది మంచి అవకాశంగా నిలవనుంది.

సదస్సు ద్వారా రాష్ట్రంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌లు ఏర్పడి యువతకు పెద్దఎత్తున నైపుణ్యాధారిత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

భారత్ రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఈ సదస్సు మరింత బలాన్ని చేకూర్చనుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# స్థిరంగా పెట్రోల్, డీజిల్ ధరలు

**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ చమురు సంస్థలు మంగళవారం పెట్రోల్, డీజిల్ ధరలను యథాతథంగా కొనసాగించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా వ్యయాలు, రాష్ట్రాల పన్నులను పరిగణనలోకి తీసుకుని ప్రతిరోజూ ఉదయం ఇంధన ధరలను ప్రకటిస్తుంటాయి.

తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర నగరాల్లో స్థానిక పన్నుల కారణంగా స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంధన ధరలు మారలేదు. విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51గా, డీజిల్ ధర రూ.105.20గా కొనసాగుతోంది. విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రాంతాల్లో కూడా స్వల్ప వ్యత్యాసాలతో ఇదే స్థాయిలో ధరలు నమోదవుతున్నాయి.

అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో దేశీయ మార్కెట్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయని చమురు రంగ నిపుణులు పేర్కొంటున్నారు.



## ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు.. ఇంధన ధరలపై ప్రభావం

**2హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో ముడి చమురు మార్కెట్‌లో తీవ్ర హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. హార్ముజ్ జలసంధి సమీపంలో ఖతార్‌కు చెందిన ముడి చమురు రవాణా నౌకపై జరిగిన దాడి, అనంతరం ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా చేపట్టిన చర్యలతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

అయితే పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఇరు దేశాలు దాడులను నిలిపివేసి దోహాలో చర్చలకు అంగీకరించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో కొంత ఊరట కనిపించింది. దీంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 73.39 డాలర్లకు చేరుకున్నప్పటికీ, అనంతరం స్వల్పంగా తగ్గింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల సమీపంలో కొనసాగుతోంది.

హార్ముజ్ జలసంధి మీదుగా నౌకాయానం కొనసాగుతున్నప్పటికీ, పర్షియన్ గల్ఫ్‌లో వందలాది నౌకలు నిలిచిపోవడంతో కొన్ని చమురు ట్యాంకర్లు తమ ప్రయాణాలను తాత్కాలికంగా నిలిపివేశాయి. దీంతో ప్రపంచ చమురు సరఫరాపై ఆందోళనలు కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దేశీయంగా కూడా ఇంధన ధరలు పెరిగాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగు దఫాల్లో పెరిగి లీటరుకు సుమారు రూ.7.50 నుంచి రూ.8 వరకు అదనపు భారం పడింది.


ప్రస్తుతం ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ ధర రూ.95.20గా ఉంది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.73, డీజిల్ రూ.103.82గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.113.51, డీజిల్ రూ.99.82గా ఉండగా, ముంబైలో పెట్రోల్ రూ.111.21, డీజిల్ రూ.97.83గా ఉన్నాయి. బెంగళూరులో పెట్రోల్ రూ.110.89, డీజిల్ రూ.98.80గా ఉండగా, చెన్నైలో పెట్రోల్ రూ.108.01, డీజిల్ రూ.99.66గా విక్రయిస్తున్నారు.

అంతర్జాతీయ పరిస్థితులు, ముడి చమురు సరఫరా, దౌత్యపరమైన పరిణామాలపై ఆధారపడి రానున్న రోజుల్లో ఇంధన ధరల్లో మరిన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# గోదావరిఖనిలో సింగరేణి క్యాథ్ ల్యాబ్ సిద్ధం

- గుండె వైద్యానికి అత్యాధునిక కేంద్రం ఏర్పాటు
- ఉద్యోగులు, ప్రజలకు అత్యవసర చికిత్స అందుబాటులోకి
- ఏడాదిలోనే ప్రభుత్వ ఆదేశాలతో ప్రాజెక్టు పూర్తి



**పెద్దపల్లి, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్యం అందించేందుకు గోదావరిఖని రామగుండం1 ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక కార్డియాక్ క్యాథెటరైజేషన్ (క్యాథ్) ల్యాబ్‌ను సింగరేణి సంస్థ ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడాది వ్యవధిలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగానే చికిత్స అందించే అవకాశం కలగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 33 వేల మంది సింగరేణి ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రజలకు ఈ కేంద్రం ప్రయోజనం చేకూరనుంది.

ఇప్పటి వరకు గుండెపోటుకు గురైన రోగులను హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాలకు తరలించాల్సి వచ్చేది. దీంతో అత్యంత కీలకమైన తొలి గంట సమయం వృథా అవుతూ ప్రాణాపాయం పెరిగేది. ఇప్పుడు గోదావరిఖనిలోనే అత్యవసరంగా యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక వంటి అధునాతన గుండె చికిత్సలు అందుబాటులోకి రావడంతో వేలాది మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఏర్పడింది. సుమారు 7,890 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఐదు పడకల గుండె అత్యవసర చికిత్స విభాగం, పది పడకల ఐసీయూ, ప్రత్యేక బాహ్య రోగుల విభాగం ఏర్పాటు చేశారు. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్య విధానంలో రూపొందించిన ఈ ప్రాజెక్టుపై ఏడేళ్లలో సుమారు రూ.50 కోట్ల వ్యయం చేయనున్నట్లు సింగరేణి సంస్థ తెలిపింది. ప్రతి ఏడాది సుమారు రూ.6 కోట్ల నిర్వహణ వ్యయం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. గత ఏడాదిలోనే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దాదాపు మూడు వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని స్థానికంగానే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ పేర్కొంది. ఈ కేంద్రంలో నెలకు మూడు వేల మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పడకలలో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కోసం కేటాయించగా, సాధారణ ప్రజలకు కూడా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ధరల ప్రకారం తక్కువ ఖర్చుతో సేవలు అందించనున్నారు. ఈ క్యాథ్ ల్యాబ్ ఉత్తర తెలంగాణలో గుండె వైద్య సేవలకు కీలక కేంద్రంగా నిలుస్తుందని సింగరేణి వైద్యాధికారులు తెలిపారు.





# నిరుద్యోగుల ఉద్యమానికి అండగా ఉంటాం: కవిత

- ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్
- కానిస్టేబుల్ పోస్టుల భర్తీపై ప్రభుత్వాన్ని నిలదీసిన టీఆర్ఎస్ చీఫ్
- దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులతో కలిసి ధర్నా

**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో నిరుద్యోగులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు నిరుద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నిరుద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా నిలబడలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ నియామకాల విషయంలో ప్రభుత్వం మాట మార్చిందని కవిత విమర్శించారు. గతంలో 19,200 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు ఐదు వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి, డీజీపీ కూడా ఖాళీల సంఖ్యపై స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 సంవత్సరాలు, ఎస్ఐ పోస్టులకు 38 సంవత్సరాల వరకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలకు కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించడంలో తాము కీలక పాత్ర పోషించామని, ఇప్పుడు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న మహిళల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన విధానం ప్రకటించాలని, నిరుద్యోగులను మభ్యపెట్టే విధానాలను వెంటనే విరమించుకోవాలని కవిత అన్నారు. జూలై 2న నిరుద్యోగులు చేపట్టనున్న సచివాలయం ముట్టడి కార్యక్రమానికి అవసరమైతే తమ పార్టీ కూడా మద్దతు ఇస్తుందని తెలిపారు. ఉద్య




మకారులు, నిరుద్యోగులు కలిసి పోరాటం చేస్తే ప్రభుత్వం స్పందించాల్సిందేనని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ అమలు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# స్థిరంగా పెట్రోల్, డీజిల్ ధరలు

**హైదరాబాద్, జూన్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశీయ చమురు సంస్థలు మంగళవారం పెట్రోల్, డీజిల్ ధరలను యథాతథంగా కొనసాగించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, రవాణా వ్యయాలు, రాష్ట్రాల పన్నులను పరిగణనలోకి తీసుకుని ప్రతిరోజూ ఉదయం ఇంధన ధరలను ప్రకటిస్తుంటాయి.

తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర నగరాల్లో స్థానిక పన్నుల కారణంగా స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంధన ధరలు మారలేదు. విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.51గా, డీజిల్ ధర రూ.105.20గా కొనసాగుతోంది. విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రాంతాల్లో కూడా స్వల్ప వ్యత్యాసాలతో ఇదే స్థాయిలో ధరలు నమోదవుతున్నాయి.

అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో దేశీయ మార్కెట్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయని చమురు రంగ నిపుణులు పేర్కొంటున్నారు.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in